# సలహా

— యం. రాధ



మైడియర్ శైలూ!

ఈ నాలుగేళ్ల వైవాహిక జీవితంలో నేనెంతో ఆనందించే విషయం నీ ఉత్తరాల్ని చదవడం తిరిగి నీకు రాసి నా హృదయభారాన్ని తగ్గించుకోవడం.

పరిస్థితులన్నిటినీ పదిలంగా మూట కట్టి ఏ సముద్రంలోకో విసిరేసి చేతులు దులుపుకోవాలని వుంది. కానీ... వాటిలోనే కూరుకుపోయి బయటకు రాలేకపోతున్న నేను వాటిని ఓ కొలిక్కి ఎలా తీసుకురాగలను.

ఆలోచించగా ఆలోచించగా నా సమస్యకి ఒకే ఒక్క పరిష్కారం కనిపించింది. అది నీ ముందుంచుతున్నాను. దానికి నీ సలహా కూడా కావాలి.

శైలూ! నా కన్న నువ్వెప్పుడూ తెలివైన దానివని నమ్ముతాను. నీ సలహాలు ఎన్నోసార్లు నా సమస్యల్ని పరిష్కరించాయి. ముఖ్యంగా.... అనుక్షణం నన్ను కృంగదీసే ఈ సమస్యకి.... దానికి పరిష్కారంగా నేనెన్నుకున్న మార్గానికి.... నీ అంగీకారం కావాలి.

నీకు తెలుసుగదా నా చిరకాల మనోవ్యథ, నా భర్త..... ఆయన తాగుడు. దీన్నించి నా దృష్టి మళ్లించుకుని ఏదైనా వ్యాపకం కల్పించుకోవాలని వుంది. ఇంక ఆయన మారతారని, ఆ తాగుడు మానతారనే నమ్మకం నాలో సన్నగిల్లి పోయింది. అందుకే దాన్ని గురించి ఆలోచించకుండా, నా మనసును దారి మళ్లించడమే నా ఈ సమస్యకు పరిష్కారమని పిస్తోంది.

గ్రాడ్యుయేషన్ డిస్కంటిన్యూ చేసి నాకు నా భర్తని 'కేరెనాట్' అనగలిగిన స్థాయిలో ఉద్యోగం దొరకడం అసంభవం. చిన్న చిన్న స్కూళ్లలో ఏ నాలుగైదు వందలకో పనిచేసినా తిరిగి 'భర్తమీద ఆధారపడ్డాన'న్న చులకన భావన ఆయనలో అలాగే వెళ్లూని వుంటుంది కదా!

మరి, నా మనసును మళ్లించి, ఆర్థికంగా కూడా నాకు ప్రోత్సాహాన్నం దించగల మార్గమేమైనా వుందా? వుంటే ఈ నీ స్నేహితురాలికి చెప్పి పుణ్యం కట్టుకో. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తాను.

నీ సుగుణ

ఉత్తరం అంటించి మర్నాడు పోస్ట్ చెయ్యాలనుకుని టేబిల్ సొరుగులో పడేసి టైము చూస్తే 11 గంటలయింది. పిల్లలు గాఢ నిద్రలో వున్నారు. తనుకూడా ఏ తొమ్మిది గంటలకో తిని పడుకుంటే ఆయన వచ్చినప్పుడు లేచి తలుపు తీసి అన్నం పెట్టక తప్పదు. అలాంటప్పుడు కడుపులో భోజనం అరుగుతూ, అరుగుతూ వుండటంతో చెప్పలేని బాధ కలిగిస్తుంది. పోనీ తినేసి మెళకువగా వుందామా అంటే తిన్నాక నిద్రాగదు తనకు. అందుకే తినకుండా ఎదురు చూడ్డం. తాగొచ్చిన భర్త నామ మాత్రంగా ఓ మెతుకు తిని పడుకుంటే మళ్లీ మర్నాడు తొమ్మిదికే లేవడం. తనకి కూడా ఆలోచనలు ఎంతో అణిచిపెట్టి నిద్రలోకి జారుకుంటే, మర్నాడు మళ్లీ ఆరు గంటలకే మెళకువ వచ్చేది.

ఆమె ఆలోచనలను భగ్నం చేస్తూ డోర్ బెల్ అదే పనిగా మోగుతోంది.

గబగబా వెళ్లి తలుపు తీసింది సుగుణ. భర్త లోపలి కొచ్చి బట్టలు విప్పే లోగా మౌనంగా భోజనం వడ్డించింది. షర్ట్ ఓ మూలా, ప్యాంటు ఓ మూలా విసిరేసి, కాళ్లూ చేతులు కడుక్కుందుకు బాత్ రూమ్‌లో కెళ్లాడు సుధాకర్.

డైనింగ్ టేబిల్ దగ్గర కొచ్చేసరికి ముభావంగా రెండు కంచాల్లో అన్నం వడ్డిస్తోంది సుగుణ.

"నువ్వింకా తినలేదా?" అని అడిగాడు సుధాకర్ విసుగ్గా.

ఇది రోజూ అడిగే ప్రశ్నే అయినా అడగడం మాత్రం మానడు.

"లేదు" అంది సుగుణ ముక్తసరిగా.

"ఏం? ఎందుకీ పాతివ్రత్యం? మళ్లీ తెల్లారి లేచి నడుం నొప్పి, తల నెప్పి అని మూలగడానికా? నాకె లాగూ తప్పవు అవన్నీ." అంటూ సణుగుతూ అన్నం తింటున్న సుధాకర్ కంచంలో పులుసు పొయ్యబోయింది.

"ఏమిటా చెత్త. అవన్నీ తినే ఓపిక నాకు లేదు. మజ్జిగ పోసెయ్యి." అన్నాడు ముద్దగా, విసుగ్గా.

అతడికి మజ్జిగ పోసి అప్పుడు తను అన్నం కలుపుకోసాగింది సుగుణ. ఇంకా సుగుణ ఓ ముద్ద కూడా తినకుండానే సుధాకర్ మజ్జిగ అన్నం ఓ రెండు ముద్దలు తిన్నట్టే తిని కంచంలో చెయ్యి కడిగేసుకున్నాడు.

సుగుణకి ఒళ్లు మండిపోయింది. ఎంత నిర్లక్ష్యం. ఎక్కడికక్కడ పచ్చడి, కూర అన్నీ పారే శాడు. ఏం చెయ్యాక పోతే 'ఈ మజ్జిగ మెతుకులు తినకపోతే యేం' అని కంచం దగ్గర కూచోకుం డానే వెళ్లిపడుకుంటాడు.

ఇంట్లో నిత్యావసర వస్తువులకి డబ్బిచ్చేట ప్పుడు మాత్రం పొదుపులో డాక్టరేట్ పుచ్చుకున్న వాడిలా లెక్క చూసి మరీ ఇస్తాడు. తను చేసే దుబారాకు అంతేలేదు. ఈ ప్రవర్తన నేమనాలి. "ఇంకా నయం! పని మనిషి చుక్కమ్మ మొగుడిలా తాగొచ్చి చావగొట్టడం లేదుగా" అనుకుని సంతో షించాలా?'

ఆలోచనలు మనసుని ముసురు కొంటూంటే ముద్ద కిందకి దిగడం లేదు సుగుణకి. ఎలాగో అయిందనిపించి తెములు్చకుని పడుకునేసరికి అప్పటికే సుధాకర్ గాఢ నిద్రలో మునిగినట్లు అర్ధమయింది.

బార్‌లో ఖాతా వుంది ఆయనకి బార్ ఓనర్ కొడుకు ఆయన స్టూడెంట్ కాబట్టి ప్రతి నెలా ఫస్ట్ తారీఖుకి బిల్లు చెల్లించేసేలా ఒప్పించాడా యన. నెల జీతం రాగానే ముందక్కడకట్టేసి మిగిలిందే ఇంటికి తెస్తాడు. ఈ ఖాతా మూలంగా రోజూ డబ్బు ఇవ్వక్ఖర్లేదు కాబట్టి ఒక్కో రోజు మరి కొంచెం అదనంగా తాగడం, అప్పుడప్పుడు ఏ ఫ్రెండ్‌నో కూడా తీసికెళ్లి ఇప్పించడం ఇదీ వరస. చివరకి ఆ బిల్లు నెలకి ఏ రెండు వేలో తేలుతుంది. తనేమో అలగా జనంలా కొప్పు ముడేసి, కొంగు దోపి వీధిన పడి అరవనూ లేదు. ఇటు హై క్లాస్ సొసయిటీ లేడీలా తనూ ఓ క్లబ్‌కి పోయి ఏ పేకాటో ఆడుతూ కూచోనూ లేదు. ఛీ ఛీ పాడు బతుకు!

ఇలాంటి ఆలోచనలతో నిద్రలేని రాత్రులు చాలానే గడిపింది సుగుణ.

లేస్తూనే సుధాకర్ చేతిలో తల నొప్పి మందు సీసా, మరో చేతిలో సిగరెట్టూ మామూలే. కాఫీ తాగుతూ, ముద్దలు ముద్దలు ఆ మందు నుదు రుకి పట్టిస్తూ ఆహాంగ్ ఓవర్ నుంచి బయటపడదా మనుకుంటాడతను. కానీ మళ్లీ అది బార్లోనే సద్దుకుని, తిరిగి ఉదయాన్నే అతనితో పాటే నిద్ర లేస్తుంది.

గత నాలుగేళ్లుగా భర్త తాలూకు ఈ దిన చర్యలో ఎలాంటి మార్పూ లేకపోవడం గమ నిస్తూనే వుంది సుగుణ. మొదట్లో చాలా గొడవ చేసేది. ఏడ్చేది, దెబ్బలాడేది, అన్నం మానేసేది.

ఊహూ! ఏవీ ఆ మానవుణ్ణి వీస మెత్తు కదిలించలేదు.

సుధాకర్‌లో మంచి తెలివి తేటలున్నాయి. ఎం.ఎస్సీ మాథ్స్ చేసిన సుధాకర్‌కి మాథ్స్ లెక్చ రర్‌గా బ్రహ్మాండమైన పేరుంది. ఎలాంటి క్లిష్టతర మయిన లెఖ్ఖని కూడా క్షణంలో చేసి, దాన్ని పిల్ల లకి సులభంగా బోధిస్తాడు. క్లాసులోకడుగెట్టి లెసన్ ప్రారంభిస్తే అప్పటిదాకా ఆవలిస్తున్న బద్ధకిస్ట్ కూడా అలర్ట్ అయిపోయి పాఠం వింటాడు.

అలాంటి మేధస్సును మత్తులోకి దింపేస్తూ అటు బుద్ధినే కాక, ఇటు శరీరాన్ని కూడా క్షీణింప చేసుకుంటు న్నాడు సుధాకర్. ఈ సమస్యకి పరి ష్కారం ఏమిటి? ఎప్పుడు? ఎలా? అన్నవే అను క్షణం సుగుణని వేధించే ప్రశ్నలు.

ఈ తాగుడి కారణంగా.... ఆమె ఎన్నో అంద మైన సాయంత్రాలు ఒంటరిగా గడిపింది. భర్త నుంచి పొందవలసిన మధురానుభూతులను, చిన్న చిన్న సరదాలను కోల్పోయింది. అవన్నీ ఎప్పుడో గతంలో కెళ్లిపోయాయి. ఆ తరవాత ఆమె కోరుకున్నవి సరదాలు కావు. సత్యాలు. ఎదుగుతున్న పిల్లల జీవితాలకి, చెడిపోతున్న అతని ఆరోగ్య పరిస్థితికి భద్రత కావాలనుకుంది. నెలకి కేవలం అతని తాగుడి కయ్యే ఖర్చుతో ఓ నిండు కుటుంబం కడుపు నిండా భోజనం చెయ్యొచ్చన్న నిజం ఆమె మనసును మండిం చింది.



కానీ ఏ విషయంలోనూ, ఆమె చేసిన ఎలాంటి ప్రయత్నం ఫలించలేదు. అందుకే ఆమె ఈ సమస్య నుంచి తన మైండ్‌ని డైవర్ట్ చేసుకోవాలనుకుంది.

స్నేహితురాలి జవాబు కోసం ఎదురు చూస్తున్న సుగుణకి ఆరోజు పోస్ట్ మాన్ తెచ్చిన ఉత్తరం ఆనంద డోలికల్లో ఊగించింది.

మైడియర్ గుణా!

ఇన్నాళ్లకి నీ నుండి ఓ వైవిధ్య పూరితమైన మంచి ఉత్తరం అందుకున్నాను. గతంలో నువ్వెప్పుడు రాసినా నీ భర్త గురించి ఆలోచనలూ, అతడిని మార్చే నీ ప్రయత్నంలో వైఫల్యాలూ... ఇవే వుండేవి. ఇప్పుడు మాత్రం 'అతణ్ణి మార్చడం ఎలా?' అన్న ప్రశ్న లేకుండా 'నీమైండ్‌ని డైవర్ట్ చేసుకోడం ఎలా?' అన్న నీ ఆలోచన నాకు చాలా నచ్చింది.నీలో ఇలాంటి మార్పుకు ప్రారంభోత్సవం ఎప్పుడా అని నేను ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాను. అన్నిటికీ నీ మనసే మూలం. పట్టించుకుంటే ప్రతీదీ భూతద్దంలోలా కనిపిస్తుంది. ముఖ్యంగా ఇలాంటి సమస్యలు విడాకులతో తప్ప పరిష్కారం కావు. అది అనుకున్నంత సులభమూ కాదు.

అందుకే నువ్వు ముందుగా నీ ఒంటరితనపు సమస్యను పరిష్కరించుకుదామని ప్రయత్నించడం నా కెంతో ఆనందంగా వుంది.

నీ విషయంలో నా ఆలోచనలు ఇప్పటివి కావు. నీ చదువుకి మంచి ఉద్యోగం రాదని దిగులుపడకు. ఇంట్లోనే వుండి మనం చేసుకోగలిగిన ఎన్నో పనుల్లో ఓ మంచి పని 'క్రష్' నడపడం ఒకటి. పసి పిల్లల మధ్య వాళ్ల కేరింతలతో, ఆటపాటలు, ఏడుపులతో మనకి తెలియకుండా కాలం గడిచిపోతుంది. మరే ఆలోచనకు తావుండదు. కొంత కాలం అలవాటవుతే వాళ్లంటే వాత్సల్యం పెరిగి, బంధం పెన వేసుకుంటుంది. నీకు కష్టం కలిగించేలా, నీ మనసుకు వ్యతిరేకంగా.... అదే... నీ భర్తలా... ప్రవర్తించడం ఆ పసివాళ్లకి తెలియదు. అమాయకంగా..... ప్రేమించడమే గానీ, ద్వేషించడం కూడా తెలి యని ఆ చిన్నారుల ప్రపంచంలో మనల్ని మనం మర్చిపోవచ్చు. ఆ ఆనందంతో పాటు నీకు ఆర్థిక స్వాతంత్ర్యం కూడా దొరుకుతుంది.

పోతే... ఇంకో ముఖ్య విషయం. ఈ సలహా కూడా పాటిస్తేనే మన స్నేహం నిలుస్తుంది. లేకపోతే మళ్లీ మన మధ్య అక్షరం నడవదు.

నీ భర్త రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపు తీసి, అతనికి అన్నం పెట్టడానికి ఓ పనివాడిని కుదుర్చు. లేదా ఓ ముసలమ్మని పెట్టు. నువ్వు తొమ్మిదికల్లా తిని నిద్రపో. అతడు తలుపు కొట్టినా, నిన్ను పిలిచినా పలకకు. నిద్ర రాకపోయినా నటించు. అప్పుడు నీ మనసుకు ప్రశాంతత, నీకు ఆర్థిక స్వాతంత్ర్యమే కాకుండా నీ కుటుంబ జీవితంలో కూడా రావలసిన మార్పు రావచ్చు.

నీ అభిప్రాయం తెలియజేస్తే నేను వచ్చి కొద్ది రోజులుండి నీ చేత క్రష్ పెట్టించి మరీ వెనక్కి వస్తాను.

నీ శైలజ

ఉత్తరాన్ని పదే పదే చదివింది సుగుణ. నాలుగు రోజులు దీర్ఘాలోచనానంతరం శైలజను రమ్మని లెటర్ రాసింది.

● ● ● ●

మొదట్లో క్రష్ గురించి చాలా గొడవ చేశాడు సుధాకర్. 'నాకు వ్యాపకం కావాలి. ఇది నా స్వవిషయం. దీన్ని మానే ప్రసక్తే లేదు' అని మొండిగా సమాధానమిచ్చింది సుగుణ.

తన క్రష్‌లో ఆయాగా పనిచేసేందుకు కుదుర్చుకున్న చుక్కమ్మ అత్తనే భర్తకి రాత్రి వేళ తలుపు తీసేందుకు, అతనికి అన్నం పెట్టేందుకు కుదిర్చింది సుగుణ.

మొదటి రోజు ఆమెని చూసి పెద్ద పెద్ద కేకలేశాడు సుధాకర్.

"పని మనిషి చేత నాకు భోజనం పెట్టిస్తావా? నువ్విక్కడ ఉన్నదెందుకు?" అని అరిచాడు.

"నా పిల్లల కోసం" అంది సుగుణ నిర్లక్ష్యంగా.

"పో వాళ్లని కూడా తీసుకుపో" అని రంకెలేశాడు.

"మేం ముగ్గురం. మీరు ఒక్కళ్లు. కాబట్టి మీరెళ్లడమే తేలిక. ఈ అద్దె నేనిచ్చుకుంటాను" అంది సుగుణ తొణక్కుండా.

"ఎంత పొగరే?" అంటూ చెయ్యె త్తి మీద కెళ్లాడు సుధాకర్.

కానీ... హఠాత్తుగా తన చేతిలో శక్తి లేనట్టు చెయ్యి ఒణుకుతున్నట్టు అనిపించిందతనికి.

తన కేకలకి తన గుండె టకటకా అదురుతున్నట్టు కొట్టుకోవడం గమనించాడు. పళ్లు కొరుకుతూ మంచం మీద కుప్పలా కూలిపోయాడతడు.

ఉదయం 8.30కే క్రష్ ప్రారంభమయిపోతుంది. అందుకే 9 గంటలకి లేచే సుధాకర్‌కి ఫ్లాస్కులో కాఫీ పోసేసి, టిఫిన్ టేబిల్ మీదమూత పెట్టేసి క్రష్ గదిలోకి కెళ్లిపోతుంది సుగుణ.

చుక్కమ్మ చెప్పిన ప్రకారం తలుపు తీస్తోంది. గానీ, ఒక్కనాడూ ఆమె వడ్డించగా అతను తినలేదు. కొన్నాళ్లు బయటే ఏదో తిని వచ్చేవాడు. మరి కొన్నాళ్లు పస్తు పడుకునే వాడు. కొన్నాళ్లు తనే వడ్డించుకు తినేవాడు. ఆ విషయాలేవీ పట్టించుకోకుండా నిర్లిప్తంగా వుండిపోయింది సుగుణ.

రాను రాను తన ఆరోగ్యం క్షీణిస్తున్నట్టు అనిపించింది సుధాకర్‌కి. బయటి భోజనం ఏ మాత్రం సయించడం లేదు. ముసలి దాన్ని చూస్తే అసలు ఆకలే చచ్చిపోతోంది. చివరికి రోజూ కన్న కొంచెం ముందుగా రావడం ప్రారంభించాడు.

అయినా తొమ్మిదికల్లా తను తినేసి డ్యూటీ పని మనిషి కప్పు చెప్పి పడుకుంటోంది సుగుణ.

అటు కాలేజీ, ఇటు ట్యుటోరియల్ కాలేజీ అయ్యాక ఏడు గంటలకి ఆదరాబాదరా బార్‌కి చేరి రెండు పెగ్గులు వేసుకుని ఇంటికి పరుగెడుతున్నాడు సుధాకర్. గత నెల నుంచీ సరయిన టైముకి తిండి లేక నిస్త్రాణగా ఫీలవుతున్నాడతను.

మునిపటి మీద పెగ్గులు తగ్గడంతో కొంచెం మత్తు తగ్గి తనను గురించి ఆలోచించడం ప్రారంభించాడీమధ్య. తనను ఇన్నాళ్లూ నిలబెట్టిన ఆధారాన్ని దేన్నో పోగొట్టు కుంటున్నట్టు అనుమానపడసాగాడు అతడు. అయినా అప్పుడప్పుడు అతన్ని పురుషాహంకారపు పొరలు కప్పడంతో ద్వైదీభా వంలో కొట్టు మిట్టాడుతున్నాడు.

ఈ విషయాలన్నీ ఎప్పటి కప్పుడు శైలజకి తెలియపరుస్తూనే వుంది సుగుణ. ఆరోజే శైలజ నుంచి మరో ఉత్తరం వచ్చింది సుగుణకి.

మైడియర్ గుణా!

చూశావా! అతడలా బొత్తిగా పాడవడానికి కారణం నువ్వేనని ఇప్పటికయినా తెలిసిందా? అతడికి నువ్విచ్చే డిపెన్డెన్సీ ఫీలింగ్ ఇన్నిటికీ కారణం. ఆధారమున్నంత సేపు మనిషి హాయిగా, నిర్లక్ష్యంగా వుంటాడు. ఆధారం పోతున్నట్టు తెలిసేసరికి-తను పడిపోకుండా నిలదొక్కుకుందుకు ప్రయత్నిస్తాడు మనిషి. ఇది అందరి విషయంలో కాకున్నా, కొంత మంది మగవాళ్లతో వచ్చే సమస్యలు మాత్రం కేవలం డిపెన్డెన్సీ వలననే. అర్థమయిందా సుగుణా! తను ఇంటి కొచ్చేసరికి తన కోసం ఎదురు చూస్తూ కంచంలో వడ్డించి తినిపించే భార్య వుందనే ధైర్యం, నిర్లక్ష్యం అతన్నలా నడిపించాయి. ఇప్పుడు అవి అతనికి దొరకడం లేదు. 'అవి కావాలంటే తను ఏం చేయాలి?' అన్న ప్రశ్నతో అతనిలో మార్పు మొదలవుతుంది. ఇంకా నీ స్వంత తెలివితో ఎన్నో ప్రయోగాలు చేసి అతన్ని పూర్తిగా మార్చచ్చు. కానీ నువ్వు చేసేవి ప్రయోగాల్లా వుండకూడదు. నీ డైవర్షన్‌ని నువ్వు నేచురల్ గానే వెదుక్కోవాలి. ఏదయితేనేం ఇప్పుడు నీ గురించి దిగులు నాకు చాలా వరకు తగ్గింది. త్వరలో నీ భర్త కూడా మారినట్టు నాకు రాస్తా వనిపిస్తోంది. క్రష్ మాత్రం ఎలాంటి పరిస్థితుల్లోనూ క్లోజ్ చేయకు. త్వరలో మళ్లీ నిన్ను చూడ్డానికి వస్తాను.

నీ శైలు.

❑

**అగ్నిపరీక్ష :**

తక్కిన అన్ని నెలలకన్నా అగ్ని పర్వతాలు జూన్ నెలలో ఎక్కువసార్లు పెల్లుబకడం కనిపిస్తుందని ఆమధ్య సోవియట్ శాస్త్రజ్ఞుడు ఒకాయన చెప్పాడు.

జూన్ నెలలో పరీక్షా ఫలితాలు రావడానికీ దీనికీ ఏదయినా సంబంధం ఉందేమో చూడాలని మూడుసార్లు పరీక్ష తప్పి తన తల్లిదండ్రుల నుంచి ఘనంగా 'పూజ'లందుకున్న అబ్బాయి కోరుతున్నాడు.